ప్రజాశక్తి
గురువారం 18 డిసెంబర్ 2025
5
విజయనగరం





విజయవాడలో జరుగుతున్న జిల్లా కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న విజయనగరం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి

నిరుపయోగంగా ప్రజాసేవా భవనాలు

- అద్దె భవనాల్లో సేవలు
- పనులు పూర్తయ్యేదెన్నడో ?
- నేటికీ ప్రారంభానికి నోచని సొంత భవనాలు
- పట్టించుకోని పాలకులు



మధ్యలో ఆగిపోయిన సచివాలయ భవనంలో ఏర్పాటు చేసుకున్న రెస్ట్‌రూమ్

ప్రజాశక్తి-సంతకవిటి

సంతకవిటి మండలంలో ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలు కాగితాలకే పరిమితమవు తున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే కొన్ని చోట్ల భవనాలు పూర్తి అయినప్పటికీ ఇంకా నిరుపయోగంగానే ఉన్నాయి. కోట్లాది రూపాయలు కేటాయించినప్పటికీ, ప్రజలకు మేలు చేసే సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల భవనాలు ఇంకా అపూర్ణంగానే ఉండటం ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. భవనాలు పూర్తి అయినప్పటికీ బిల్లులు పెండింగ్ ఉండడంతో ప్రారంభానికి నోచుకోలేదు. కొన్ని చోట్ల ఒకే కార్యాలయంలో అన్ని సేవలూ అందిస్తున్న పరిస్థితి నెలకొంది.

మండలంలో మొత్తం 24 గ్రామ సచివాలయాలు ఉండగా, ఇప్పటికీ కేవలం 18 భవనాలే పూర్తయ్యాయి. మిగిలిన ఆరు సచివాలయాలు శిథిలావస్థలో ఉన్న తాత్కాలిక భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ప్రజలు కూర్చునే సౌకర్యం లేక, వర్షం వచ్చినా, మండుటెండ లో ప్రజలు గంటల తరబడి వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొంది.

రెస్ట్ రూమ్‌గా గొల్లవలస సచివాలయం

గొల్లవలస సచివాలయ నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోవడంతో అధికార పార్టీకి చెందిన నాయకుడు ఏకంగా ఓ రెస్ట్ రూమ్‌గా ఏర్పాటు చేసుకున్నారు. అయితే తనే కాంట్రాక్టర్ అని, నిధులు మంజూరు కాకపోవడంతో ఏకంగా సచివాలయ భవనాన్ని తన సొంత అవసరాలకు ఉపయోగించుకుంటున్నారని పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. అయితే సంబంధిత అధికారులు మాత్రం చూసీ చూడనట్టుగా వ్యవహరిస్తున్నారు. తక్షణమే అధికారులు స్పందించి సచివాలయ నిర్మాణ పనులు చెపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అన్నదాతలకు సేవా కేంద్రాలు కరువు

రైతుల కోసం ఏర్పాటు చేసిన రైతు సేవా కేంద్రాల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. మండలంలో ఉండాల్సిన 24 రైతు సేవా కేంద్రాల్లో కేవలం 11 కేంద్రాలకే సొంత భవనాలు ఉన్నాయి. మిగిలిన కేంద్రాలు నిర్మాణాలు పూర్తయినప్పటికీ నేటికీ ప్రారంభం కాలేదు. అయితే కొన్ని భవనాలు శిథిలావస్థలో కొనసాగుతున్నాయి. మరికొన్ని అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ప్రభుత్వం వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోందనిగొప్పలు చెప్పుకునే పాలకులు, ఈ పరిస్థితిపై మౌనం వహించడం గమనార్హం.



అద్దె భవనంలో నిర్వహిస్తున్న రైతు సేవాకేంద్రం

అద్దె భవనంలో సేవలు

సిరిపురం, గొళ్ళవలస తదితర గ్రామాల్లో రైతు సేవా కేంద్రం అద్దె భవనంలో సేవలు అందిస్తున్నారు. అయితే సొంత భవనం పూర్తి అయినప్పటికీ... నేటికి ప్రారంభం కాకపోవడంతో నిరూపియోగంగా ఉన్నాయి. అయితే ప్రభుత్వం ఒక పక్క వేలాది రూపాయలు అద్దెలు కడుతున్న... కనీసం సొంత భవనాలు మాత్రం కన్నెత్తి చూడటం లేదు. దీనితో ప్రజాధనం వధాగా పోతోందని ప్రజలు బహిరంగానే విమర్శలు చేస్తున్నారు.

విలేజ్ వైద్య సేవలు ఎక్కడ. ?

వైద్య సేవల విషయానికి వస్తే పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. మండలంలో ఏర్పాటు చేయాల్సిన 21 విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో కేవలం 9 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. తామరం, హుజరాం తదితర ప్రాంతాల్లో అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ప్రభుత్వం అద్దె భవనాలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తుంది కాని సొంత భవనాలు కు మాత్రం రెడ్ సిగ్నల్ ఇస్తూనే ఉంది. దీంతో మిగిలిన క్లినిక్‌లు తాత్కాలిక ఏర్పాట్లతో నడుస్తున్నాయి. మరి కొన్ని చోట్ల సచివాలయలోని ఒక్క రూమ్ లో వైద్య సేవలు అందిస్తున్న పరిస్థితి నెలకొంది. కనీస వసతులు లేకపోవడంతో గర్భిణీలు, వృద్ధులు, చిన్నారులకు సరైన వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నారు.

విష సర్పాలకు నిలయాలుగా కార్యాలయాలు

కొండగూడెం, మంతిన, సిరిపురం, గరికిపాడు, తమరాం తదితర సచివాలయా ప్రజాసేవా కేంద్రాలు పూర్తి అయ్యియి. కానీ చిన్న చిన్న పనులు పెండింగ్ ఉండడంతో నేటికి ప్రారంభం కాలేదు. దీంతో భవనాల చుట్టూ పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగిపోయి ఆయా భవనాలు విష సర్పాలకు నిలయాలుగా మారాయి.

భవనాల నిర్మాణాలు పూర్తయి ఏళ్లు గడిచినా భవనాలు ప్రారంభం కాకపోవడంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు ఎప్పుడు స్పందిస్తారో? మిగిలిన భవనాలు ఎప్పుడు పూర్తవుతాయో అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. తక్షణమే ప్రభుత్వం స్పందించి, మిగిలిన సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలను వేగవంతం చేసి పూర్తి స్థాయి సేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరలో భవనాలు ప్రారంభిస్తాం

మండలంలో పూర్తయిన సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు త్వరలో ప్రారంభిస్తాం. పూర్తికాని భవనాలకు నిధులు మంజూరు అయిన వెంటనే పనులు పూర్తి చేస్తాం.

రియాజ్, పంచాయతీరాజ్ ఎఇ, సంతకవిటి



ప్రారంభానికి నోచుకోని విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం

ఊరూరా పశుగ్రాస కేంద్రాలు : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఊరూరా పశుగ్రాస కేంద్రాలను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి కోరారు. రాష్ట్ర సచివాలయంలో బుధవారం నుంచి ముఖ్యమంత్రితో కలెక్టర్ల సమావేశం ప్రారంభమయ్యింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో పశుగ్రాస కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా పాడి పరిశ్రమ వృద్ధి చెందుతుందని సూచించారు. తద్వారా పాల ఉత్పత్తి పెరగడమే కాకుండా, గ్రామీణ ప్రజల ఆర్థిక పరిస్థితి బలోపేతం అవుతుందని అన్నారు. పశుగ్రాసం పెంచడానికి ప్రభుత్వనుంచి ప్రోత్సాహాలను అందించాలని కోరారు. 2016-2019 మధ్య ఈ పథకం అమలయ్యిందని ఈ సందర్భంగా కలెక్టర్ గుర్తు చేశారు. దీనిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందిస్తూ, ఈ ప్రతిపాదనను పరిశీలించాలని సంబంధిత ఉన్నతాధికారులను ఆదేశించారు. సచివాలయంలో జరుగుతున్న కలెక్టర్ల కాన్ఫరెన్స్ లో జిల్లా నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంయుక్త కలెక్టర్ ఎస్. సేధు మాధవన్, సిపిఒ బాలాజీ, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కార్యాలయాల్లో పిజిఆర్ఎస్ సెల్ : డిఆర్ఒ

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ప్రతీ ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లో పిజిఆర్ఎస్ సెల్‌ను ఏర్పాటు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి మురళి సూచించారు. పిజిఆర్ఎస్ వినతులపై కలెక్టరేట్ ఆడిటోరియంలో ఆయన బుధవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ ప్రతీ శాఖలో పిజిఆర్ఎస్ సెల్‌ను ఏర్పాటు చేయడం ద్వారా అర్జీదారులు తాము ఇచ్చిన అర్జీపై సంబంధిత అధికారులు తీసుకున్న చర్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొనే అవకాశం ఉంటుందన్నారు. దీనివల్ల వీరు మళ్లీమళ్లీ గ్రీవెన్స్‌కు వచ్చే పరిస్థితి ఉండదని చెప్పారు. ఈ దిశగా ప్రతీ శాఖా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అదేవిధంగా ఫిర్యాదుదారులు సంతృప్తి చెందేవిధంగా వారి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఫిర్యాదుదారులపట్ల సానుకూల దృక్పథం చూపాలని, వారికి పరిస్థితిని పూర్తిగా వివరించాలని సూచించారు. అసంతృప్తి వ్యక్తం చేసిన వారిపై ప్రత్యేక దృష్టి పెట్టి, అందుకు కారణాలను విశ్లేషించాలని చెప్పారు. శాఖాధిపతులు కూడా దీనిపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు.

19న జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈనెల 19న జిల్లా స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన విజయనగరంలోని దాసన్నపేట ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఉదయం 10గంటలకు జరుగుతుందని డిఇఒ యు.మాణిక్యంనాయుడు తెలిపారు. మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో గ్రూప్, వ్యక్తిగత, టీచర్ విభాగాల నుండి ఎంపికైన ప్రాజెక్ట్‌లను జిల్లా స్థాయి లో ప్రదర్శించేందుకు విద్యార్థులను, సంబంధిత గైడ్ టీచర్ లను శత శాతం హాజరు అయ్యేలా సంబంధిత ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు ఈ విజ్ఞాన ప్రదర్శనను విజయవంతం చేయాలన్నారు.

ఇక వాట్సాప్‌లోనూ ఆర్‌టిసి బస్ టికెట్లు

ప్రజాశక్తి-విజయనగరం కోట

మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో ఎప్పుడూ ముందుండే ఎపిఎస్ఆర్‌టిసి ఇప్పుడు సామాన్యుడికి మరింత చేరువయ్యేందుకు సరికొత్త అడుగు వేసింది. దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణీకులు కేవలం మొబైల్ ఫోన్ ద్వారా, మన మిత్ర డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా వాట్సాప్ ద్వారా సులభంగా టికెట్లను బుక్ చేసుకునే సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ప్రజా రవాణా అధికారి జి వరలక్ష్మి తెలిపారు. దీనికోసం ప్రయాణీకులు 9552300009 అనే నెంబర్‌ను తమ ఫోన్‌లో సేవ్ చేసుకుని, వాట్సాప్‌లో 'హాయ్' అని సందేశం పంపిస్తే చాలు. వివిధ రకాల సేవలు కనిపిస్తాయి వెంటనే ఆర్టీసీకి సంబంధించిన సేవల జాబితా ఎంచుకుని మీకు కావలసిన రూట్లో టికెట్ను బుక్ చేసుకుని సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ ఒక్క అవకాశాన్ని ప్రజలంతా వినియోగించుకోవాలని కోరారు.



జాతీయ పోటీలకు ఎంపికైన అనితను అభినందిస్తున్న డిఇఒ మాణిక్యం నాయుడు

జాతీయ ఖోఖో పోటీలకు అనిత ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఈనెల 21 నుంచి 25 వరకు వారణాసిలో జాతీయ ఎస్‌జిఎఫ్ అండర్ 17 జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు పూల్ బాగ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎం.అనిత ఎంపికైంది. అనితను డిఇఒ యు. మాణిక్యం నాయుడు , పీడీ షేక్ జైనాబి, పిఇటి సిఎచ్ సత్యప్రసాద్, ప్రధానోపాధ్యాయులు వి.రఘు రామరాజును అభినందించారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.ఈశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ క్రీడలతోపాటు బాగా చదువుకోవాలని చెప్పారు. జాతీయ స్థాయిలో జిల్లాకు మెడల్ తీసుకురావాలని ఆశీర్వదించారు.

5 నుంచి ఖేలో ఇండియా బీచ్ గేమ్స్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జనవరి 5 నుంచి 10వ తేదీవరకు దాదర్ అండ్ హవేలీ నగర్, డామన్ డయ్యులో జరుగు 2వ ఎడిషన్ ఖేలో ఇండియా బీచ్ గేమ్స్‌లో భాగంగా బీచ్ సెపక్ తక్ర, బీచ్ వాలీబాల్ , బీచ్ కబడ్డీ ఒపెన్ ఏజ్ కేటగిరిలో రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించేందుకు ఆసక్తి గల జిల్లా క్రీడా కారులు ఈనెల 19న విజయవాడ కృష్ణానది వద్దకు ఉదయం 8గంటలకు హాజరుకావాలని డిఎస్‌డిఒ ఎస్.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల మహిళలు, పురుష క్రీడాకారులు సంబంధిత ధ్రువపత్రాలతో అనగా ఆధార్ కార్డు, 2 పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు, జనన ధ్రువీకరణ పత్రంతో ఎంపిక పోటీలకు హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు 9491767327 (రూప్ కుమార్), 7799620244(భార్గవి) నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

19న సీనియర్ కబడ్డీ జట్టు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 26 నుండి 28 వరకు కర్నూలు జిల్లాలో జరగబోయే ఆంధ్ర అంతర్ జిల్లాల సీనియర్ పురుషుల కబడ్డీ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనే విజయనగరం జిల్లా కబడ్డీ పురుషుల జట్టు ఎంపిక ఈనెల 19వ తేదీన విజయనగరం కస్పా హైస్కూలులో జరుగుతుందని అసోసియేషన్‌జిల్లా అధ్యక్షులు రంగారావు, కార్యదర్శి ప్రభావతి, ఆర్గనైజింగ్ కార్యదర్శి లక్ష్మణరావు తెలిపారు. ఎంపికలు మధ్యాహ్నం 2 గంటలకు హాజరు కావాలని తెలిపారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

డిజిటల్ అరెస్టు, సైబర్‌నేరాల పట్ల పెన్షనర్లు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌ఛార్జి డిఎస్‌పి ఆర్. గోవిందరావు అన్నారు. నగరంలోని ఎన్‌జిఒ హోంలో బుధవారం పెన్షనర్స్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో పింఛనుదార్ల దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి డిఎస్‌పి గోవిందరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధిలో పెన్షనర్ల సేవలు ఎంతో అమూల్యమని పేర్కొన్నారు. వారు తమ జీవితాన్ని ప్రజాసేవకు అంకితం చేసి, నేటి తరాలకు మార్గదర్శకులుగా నిలిచారని అన్నారు. పెన్షనర్లు సమాజానికి అందించిన సేవలను ప్రభుత్వం ఎల్లప్పుడూ గుర్తిస్తుందని తెలిపారు. ఇటీవల కాలంలో చాలామంది వ్యక్తులు సైబరు మోసాలకు గురవుతున్నారని, నేరాలు జరుగుతున్న తీరును వివరించి, అప్రమత్తంగా ఉండాలని కోరారు. అమాయక ప్రజలను ముఖ్యంగా పెన్షనర్లను లక్ష్యంగా చేసుకొని కొంతమంది సైబరు నేరగాళ్ళు వాట్సాప్ కాల్స్ చేసి తమను డిజిటల్ అరెస్టు చేస్తున్నామని, ఇంటి నుండి బయటకు వెళ్ళ వద్దని, మాదక ద్రవ్యాల కేసులో ఇరుక్కున్నారని, ఆధార్ కార్డును దుర్వినియోగం చేసారని, మీ పిల్లల పై డ్రగ్స్ కేసు నమోదయ్యిందని, చివరకు సహాయం చేస్తున్నట్లుగా నమ్మబలికి పెన్షనర్లు నుండి డబ్బులు కొల్లగొడుతున్నారని అన్నారు.

టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శిగా లక్ష్మీవర ప్రసాద్

వార్డు అధ్యక్షుడి నుంచి అంచెలంచెలుగా ఎదిగిన ప్రసాదుల

ప్రజాశక్తి-విజయనగరం కోట

టిడిపి విజయనగరం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ప్రసాదుల లక్ష్మీవరప్రసాద్ నియమితులయ్యారు. ఈమేరకు పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి ఈ మేరకు ఉత్తర్వులు వచ్చాయి. దీంతో టిడిపి శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. లక్ష్మీవరప్రసాద్ వార్డు అధ్యక్ష స్థాయి నుంచి ఆయన అంచెలంచెలుగా ఎదిగారు. ప్రసాద్ తల్లిదండ్రులు ప్రసాదుల రామకృష్ణ, కనక మహాలక్ష్మి గతంలో విజయనగరం మున్సిపల్ చైర్మన్లుగా పదవులు చేపట్టారు. 1995 నుంచి 2005వరకు పదేళ్ల పాటు కనక మహాలక్ష్మి చైర్‌పర్సన్‌గా సేవలందించారు. ఉత్తరాంధ్ర పార్టీ పరిశీలకులుగా ఆమె బాధ్యతలు నిర్వర్తించారు. ప్రసాదుల రామకృష్ణ 2014 నుంచి 19వరకు మున్సిపల్ చైర్మన్‌గా పనిచేశారు. పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు సభ్యులుగా రామకృష్ణ పనిచేశారు. వీరి హయాంలో మున్సిపాలిటీని బాగా అభివృద్ధి చేశారు. వీరి కుమారుడైన లక్ష్మీ వరప్రసాద్ 2010లో తొలిసారిగా నగరంలోని టిడిపి వార్డు అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టారు. 2014 నుంచి 19వరకు రెండు పర్యాయాలు జిల్లా కార్యదర్శి పదవి కూడా చేపట్టారు. 2021 మున్సిపల్ ఎన్నికల్లో పూల్‌బాగ్ కాలనీ నాలుగో వార్డు నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అయితే ఆయనకు పార్టీపట్ల ఉన్న అంకిత భావం, నిబద్ధత,పార్టీ అభివృద్ధికి ఆయన చేసిన కృషిని గుర్తించిన అధిష్టానం 2022 మే 9న విజయనగరం టౌన్ కార్యదర్శిగా నియమించింది. 2024 వరకు ఆ పదవిలో కొనసాగారు. ఈ ఏడాది అక్టోబర్ 11న పార్టీ అధిష్టానం ఆయనను యాదవ కార్పొరేషన్‌డైరెక్టర్‌గా నియమించింది. ప్రస్తుతం ఆ పదవిలో కొనసాగుతున్నారు. లక్ష్మీవరప్రసాద్ పార్టీకి చేసిన సేవలను గుర్తించి ముఖ్యమంత్రి చంద్రబాబు, జాతీయ కార్యదర్శి నారా లోకేష్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించారు.



లక్ష్మీ వరప్రసాద్‌ను అభినందిస్తున్న నారా లోకేష్

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పరిసరాల పరిశుభ్రత పట్ల వీధి విక్రయదారులు మరింత పరివర్తనతో వ్యవహరించాలని కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. ఈ మేరకు బుధవారం వీధివిక్రయిదారుల పరివర్తన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థ కార్యాలయ సమీపం నుండి గణేష్ టెంపుల్ వరకు పర్యటించి వీధివిక్రయదారులకు అవగాహన కల్పించారు. ఆయా ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉండడాన్ని గమనించి వీధివిక్రయదారులను మందలించారు. మన పరిసరాలను మనమే పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. లేని యెడల అపరాధ రుసుములు విధిస్తామని చెప్పారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని ఇందులో భాగంగా క్యారీ బ్యాగులు వినియోగించరాదని చెప్పారు. నిర్దేశిత డస్ట్ బిన్లలో చెత్తలను పారిబోయాలని సూచించారు. ప్రతి తోపుడు బండి వద్ద డస్ట్ బిన్ ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. తడి చెత్త పొడి చెత్త వేరు చేస్తే చాలా ప్రయోజనకరమని తెలిపారు. పారిశుధ్య పర్యవేక్షకులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సచివాలయం పరిశీలన

క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా నగరంలోని పలు ప్రాంతాల్లో కమిషనర్ పల్లి నల్లనయ్య పర్యటించారు. 39వ నెంబర్ సచివాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పురసేవలు మెరుగుపరచాలని సూచించారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

నగరంలో వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. ఆయా పనుల పరిశీలన నిమిత్తం సంబంధిత అధికారులకు ఆదేశించారు. పలు ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎఇలు, డిఇలు పర్యవేక్షించారు. పరిశీలన కార్యక్రమంలో ఇఇ ప్రసాదు, డిఇ శ్రీనివాసరావు, ఎఇ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



వీధి విక్రయదారులతో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

కామన్ సీనియారిటీకి మార్గం సుగమం : ఎంఎల్‌సి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉపాధ్యాయుల్లో కామన్ సీనియారిటీకి మార్గం సుగమం అయిందని, కామన్ సీనియారిటీ విధానం వచ్చే విద్యా సంవత్సరం నాటికి అమలు జరిగే విధంగా కృషి చేస్తామని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు తెలిపారు. బుధవారం జెడ్‌పి గెస్ట్ హౌస్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 26 జిల్లాల్లో ఇక నుంచి కామన్ సీనియారిటీ జరగనుందని అందుకు ప్రెసిడెన్సీయల్ ఆదేశాలు వచ్చాయని తెలిపారు. ఉపాధ్యాయ కేటగిరిలను రీ ఆర్గనైజింగ్ చేయాల్సి ఉందన్నారు. విద్యా శాఖలో అన్ని యాజమాన్యాల ఉపాధ్యాయులు కామన్ సీనియారిటీ ఒకే గొడుగు కిందకి వస్తాయన్నారు. దీనికి కమిటీ వేసి కేటగిరి వారీ సర్వీసు రూల్స్ తయారు చేయాల్సి ఉందన్నారు. కొత్తగా రూల్స్ ఏర్పాటు చేసుకోవడం వల్ల ఉపాధ్యాయులకు కామన్ సీనియారిటీ అమలులోకి రానుందన్నారు. చైల్డ్‌కేర్ లీవులు వయసు లిమిట్‌తో పని లేదన్నారు.రిటైర్మెంట్ వరకు ఉపయోగించుకోవచ్చునని తెలిపారు. 2004 సెప్టెంబర్ నుంచి ఉద్యోగంలో చేరిన వారికి ఒపిఎస్ అమలుకు ప్రభుత్వం ఆమోదించి ందన్నారు. త్వరలో జీఓ అమలులోకి రానుందన్నారు. తల్లి లేదా తండ్రి ఎవరైనా సర్వీసులో చనిపోయినపుడు సంప్రదాయ కార్యక్రమాలు చేసుకోవడానికి 15 రోజులు సెలవుకు ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. ఉపాధ్యాయులకు ఆర్థికపరమైన బకాయిలు చెల్లించేందుకు ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. సమావేశంలో పిఆర్‌టి యు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రవీంద్రనాయుడు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.




పాత కాలువను కప్పేసి కొత్తగా కాలువ తవ్వడాన్ని పరిశీలిస్తున్న సర్వేయర్లు

గుర్ల గెడ్డ భూ ఆక్రమణపై సర్వే

ప్రజాశక్తి- మెంటాడ

గుర్ల గెడ్డ మినీ రిజర్వాయర్ పరిధిలోని కాలువ భూములను ఓ భూస్వామి ఎటోరో రియల్ ఎస్టేట్ సంస్థ పేరిట అక్రమంగా వాహనాలతో నొల్లించి ప్లాట్స్ వేసిన సంగతి పాఠకులకు విధితమే. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రాజెక్టు భూ విస్తరణను సర్వే చేసి పరిశీలించాలని చెప్పడంతో బుధవారం అల్లూరి సీతారామరాజు జిల్లా, అనంతగిరి మండల సర్వేయర్ తేజేశ్వరరావు, రొంపిల్లి విఆర్ఒ నాగేశ్వరరావు సర్వే నిర్వహించారు. ఈ భూమికి సంబంధించిన రికార్డులు అనంతగిరి మండలంలో లేవని బొబ్బిలి ఆర్డిఒ ఆఫీసులో ఉంటాయని వారు చెప్పారు. రికార్డులు పరిశీలిస్తే తప్పా నిజానిజాలు తెలియని పరిస్థితి అని చెప్పారు. ప్రాజెక్ట్ ఎడమ కాలువ కప్పివేసిన అప్పన్న రాజును యథావిధిగా ప్రాజెక్టు డిజైన్ ప్రకారం అప్పగించాలని ప్రాజెక్టు పోరాట సమితి సభ్యులు అడిగారు. దీనికే ఆ బడా భూస్వామి అప్పన్నరాజు పది రోజులు గడువు కావాలని అడగడంతో సభ్యులు ఒప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో గుర్లగెడ్డ ప్రాజెక్టు పోరాట సమితి కార్యదర్శి రాకోటి రాములు, ఆయకట్టు రైతులు రెడ్డి రాజు, అప్పలనాయుడు, పుర్యాన అప్పలనాయుడు, గొర్లె సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న డిఎల్ఎస్ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్

బాల్య వివాహాలు వద్దు ..భవిష్యత్తు ముద్దు

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత ఆదేశాల మేరకు వందరోజుల క్యాంపెయిన్‌లో భాగంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్, గాజులరేగ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన న్యాయ అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బాల్య వివాహాలపై న్యాయ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో వారు మాట్లాడుతూ 18ఏళ్ల లోపు బాల బాలికలకు వివాహం చేయడం చట్టరీత్యా నేరమని, రెండేళ్ల వరకు జైలుశిక్ష, జరిమానా ఉంటాయని తెలిపారు. చిన్న వయసులో వివాహాలు చేయటం వల్ల అనేక అనారోగ్య సమస్యలు ఏర్పడతాయని తెలిపారు. ఎక్కడైనా బాల్య వివాహం జరిగినట్లు లేదా చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే చైల్డ్ లైన్ టోల్ ఫ్రీ నెంబర్ నెంబర్ 1098కు లేదా జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 1 5 1 0 0 కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఇఒ పి.సత్యవతి, గాజులరేగ జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ఎం కె.వీరభద్రాచారి, వన్ స్టాప్ సెంటర్ లీగల్ అడ్వైజర్ కె.బ్యూలారాణి, బెజ్జిపురం యూత్ క్లబ్, కోఆర్డినేటర్ ఝాన్సీ రాణి పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న మాజీ విసి హనుమంతు లజపతిరాయ్

ప్రతి ఒక్కరూ పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ప్రతి ఒక్కరూ పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని అంబేద్కర్ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ హనుమంతు లజపతిరాయ్ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు, ఆంగ్ల విభాగాల ఆధ్వర్యంలో వాల్మీకి రామాయణం అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలాం రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేశారు. రక్షణ వ్యవస్థ ఆపరేషన్ సిందూర్‌కి ఎంతో దోహదపడుతుందని, సమాజ అభివృద్ధికి చేయాల్సిన కర్తవ్యం ఏమిటి? అంతర్జాతీయ సంబంధాలు గురించి పూర్తి అవగాహన ఉండాలని అన్నారు. వాటి కోసం పత్రికలు నిరంతరం చదవాలని సూచించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ సమానమేనని శ్రమను గుర్తించి గౌరవించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.రేఖ, ఐక్యూ ఎసిసి కోఆర్డినేటర్ డాక్టర్ జయపాల్ రావు, అకడమిక్ కో ఆర్డినేటర్ రూపవాణి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు అజయ్ ఎంపిక

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 9వ తరగతి విద్యార్థి నల్లబిల్లి విజయ్ రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు ఉపాధ్యాయుడు బిపి రాజు తెలిపారు. లక్కవరపుకోట మండలం నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో అండర్ 17 బాలుర విభాగంలో విజేతగా నిలిచి రాష్ట్ర స్థాయిలో జరగబోయే పోటీలకు ఎంపికయ్యాడని వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్.గోవింద తెలిపారు. సోంపురం గ్రామం నుంచి రాష్ట్ర పోటీలకు ఎంపికై పోటీల్లో పాల్గొనడానికి వెళుతున్న అజయ్‌కు గ్రామ సర్పంచ్ మురిపిండి గంగరాజు, ఎంపిటిసి, గ్రామస్తులు, పాఠశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.


సమస్యను తహశీల్దార్‌కు వివరిస్తున్న మిల్లు యజమాని

అనుమతిస్తే తప్ప ధాన్యాన్ని తీసుకోను

వేపాడ: తన మిల్లుకు అనుమతి ఇస్తే తప్ప ధాన్యాన్ని తీసుకోలేమని రామస్వామి పేట రైస్ మిల్లు యజమాని తహశీల్దార్ జి.రాముమూర్తికి స్పష్టం చేశారు. ఈ మిల్లులో ధాన్యం తీసుకోవడం లేదని కొంత మంది తహశీల్దార్‌కు ఫిర్యాదు చేయడంతో ఆ మేరకు డిటి రామకృష్ణతో కలిసి బుధవారం రైస్ మిల్లును సందర్శించారు. ఈసందర్భంగా ధాన్యం తీసుకోకపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. తాను రూ.20లక్షలు బిజి కట్టానని అనుమతులు వచ్చిన వెంటనే ధాన్యాన్ని తీసుకుంటానని యజమాని తహశీల్దార్‌కు చెప్పారు.

ఘనంగా ప్రభుత్వ పెన్షనర్స్ డే

నెల్లిమర్ల: స్థానిక కార్మిక సంఘం భవనంలో బుధవారం అఖిల భారత పింఛన్ దార్ల దినోత్సవాన్ని ప్రభుత్వ పింఛనర్ల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 75 సంవత్సరాలు నిండిన పెన్షనర్‌కి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పింఛన్ దార్ల సంఘం అధ్యక్షులు కెల్ల చిన్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి బొమ్మన ఈశ్వరరావు, పతివాడ సీతారాం పాల్గొన్నారు.


పెన్షనర్లను సత్కరిస్తున్న నాయకులు

మండల స్థాయి విద్య వైజ్ఞానిక పోటీలు

నెల్లిమర్ల: రామతీర్థం జడ్‌పి ఉన్నత పాఠశాలలో మండల స్థాయి విద్య, వైజ్ఞానిక పోటీలు బుధవారం నిర్వహించారు. ఎంఇఒ యుఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో 76 మంది విద్యార్థులు పాల్గొని సుమారు 40 ప్రదర్శనలు చేశారన్నారు. వీటి నుంచి ఏడు టీమ్‌లలో ఏడు ఉత్తమ ప్రదర్శనలు, సబ్జెక్ట్ నుంచి 2 ప్రదర్శనలు, ఉపాధ్యాయ విభాగం నుంచి రెండు ఉత్తమ ప్రదర్శనలను జిల్లాకు ఎంపిక చేస్తామన్నారు. ఉత్తమ ప్రదర్శనలు ఎంపిక చేయడానికి సికెఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల, వేణుగోపాలపురం డైట్ లెక్చరర్లు పాల్గొన్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్‌లో విద్యార్థుల ప్రతిభ

చీపురుపల్లి: జిల్లా స్థాయిలో జరిగిన స్కూల్ గేమ్స్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పట్టణంలోని గర రామానాయుడు కాలనీ వద్ద ఉన్న పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచారు. మంగళవారం ఎలకోటలో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో అండర్ 14 విభాగంలో పాఠశాలకు చెందిన పి.భాను, అండర్ 19 విభాగంలో వై.రాజులు గెలుపొందారు. కాగా వారు రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ఆర్ సత్య శ్రీనివాసరావుని, విద్యార్థులను పాఠశాల హెచ్ఎం వివికె కృష్ణకుమారితో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

సర్వేలపై శిక్షణ

వేపాడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ సంక్షేమ కార్యక్రమాలపై సర్వేలు చేయాలని నిమిత్తం సకాలంలో ప్రభుత్వానికి అందే విధంగా సచివాలయ సిబ్బంది చేపట్టవలసిన అంశాలపై సిబ్బందికి బుధవారం డిఎస్‌డబ్ల్యు జ్యోతి శిక్షణ ఇచ్చారు. ఈ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఈ సర్వేను సకాలంలో పూర్తి చేయాలని, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్, సర్వేయర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్‌డి రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

నెల్లిమర్ల: సచివాలయం సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపిడిఒ కె.రామకృష్ణరాజు సూచించారు. బుధవారం ఆయన అలుగోలు, గుషిని సచివాలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది ఉదయం 10గంటలకు వచ్చి సాయంత్రం 5గంటలకు బయోమెట్రిక్ హాజరు తప్పని సరిగా వేయాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే కాకుండా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం గుషిని ఉపాధి హామీ పనులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పలువురు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్ సందీప్ జన్మదినోత్సవం

ప్రజాశక్తి -విజయనగరం

సత్య విద్యా సంస్థల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో సత్య విద్యా సంస్థల మేనేజింగ్ ట్రస్ట్ సభ్యులు, ధీర ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ బొత్స సందీప్ జన్మదిన వేడుకలు బుధవారం సేవా కార్యక్రమాలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రేమ సమాజంలో వృద్ధులు, నిరాశ్రయులకు అన్నదానం నిర్వహించడంతో పాటు పండ్లు పంపిణీ చేశారు. మహిళలకు చీరలు పంపిణీ చేశారు. నగరంలోని అంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు పండ్లు పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ బొత్స అనూష మాట్లాడుతూ, తన తమ్ముడు జన్మదినాన్ని సమాజ సేవకు అంకితం చేయడం ఎంతో సంతృప్తినిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో మజ్జి శ్రీనివాస్, మజ్జి ఆనంద్, కేసలి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


వృద్ధులకు అన్నదానం చేస్తున్న బొత్స అనూష

పురుగు మందు కొంటేనే యూరియా..

◆ మన గ్రోమోర్ నిర్వాకం ◆ ఆవేదన చెందుతున్న రైతులు ◆ యూరియా అడిగితే గెటౌట్ అంటున్నారని మండిపాటు

ప్రజాశక్తి-చీపురుపల్లి

'పురుగు మందులు కొంటేనే యూరియా ఇస్తామంటున్నారు.. లేదంటే పొమ్మంటున్నారు.. యూరియా కోసం రోజులు తరబడి తిప్పుతున్నారు.. అవసరం లేని పురుగు మందులు తీసుకొని మేమేం చేస్తాం'.. అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చీపురుపల్లిలో మన గ్రోమోర్ వద్ద రైతులు పై విధంగా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కర్లప్లు గౌరమ్మ, గవిడి రామకృష్ణ, నేదూరి చిట్టెమ్మ, వెంపడాపు నారాయణమ్మలతో పాటు మరి కొంత మంది రైతులు చీపురుపల్లిలో గల మన గ్రోమోర్‌కు యూరియా కోసం గత కొన్ని రోజులు క్రితం వ్యవసాయాధికారులు ఇచ్చిన రసీదులు పట్టుకొని బుధవారం వెల్లారు. అయితే అక్కడ ఉన్న సిబ్బంది యూరియా లేదు గిరియా లేదు పొండి అంటూ రైతులపై దురుసుగా ప్రవర్తించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవేళ యూరియా కావాలంటే పురుగు మందులు గానీ వేరొక వస్తువు గానీ తీసుకోవాలని కొర్రి పెడుతున్నారని రైతులు తెలిపారు. ఇటీవలే సుమారు ఆరు వేల రెండు వందల ఏభై రూపాయలు విలువ చేసే జొన్నలు కొన్నానని అప్పటిలో తనకు యూరియా వచ్చిన వెంటనే ఇస్తానని తనకు మన గ్రోమోర్ సిబ్బంది చెప్పారని తీరా యూరియా కోసం వస్తే పురుగులు మందులు కొంటేనే యూరియా ఇస్తామని గ్రోమోర్ సిబ్బంది చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను కూడా ఇక్కడే జొన్నలు కొని పంట వేసానని యూరియా కోసం వస్తే గెటౌట్ అని రైతులమని చూడకుండా తమపై దురుసుగా సిబ్బంది దబాయిస్తున్నారని నేదూరి చిట్టెమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. జొన్న పంటకు వేసేందుకు రెండు యూరియా బస్తాలు కావాలంటే పురుగు మందులు తీసుకోవాలని నిబంధన పెట్టడం ఏమిటని గవిడి రామకృష్ణ అనే రైతు ఆవేదన వ్యక్తం చేశారు. అవసరం లేకుండా పురుగులు మందులు కొనాలంటే తమకి ఆర్థిక భారం పెరుగుతుందని, అవసరం లేని పురుగుల మందు తాగి చావమంటారా అని కర్లప్లు గౌరమ్మ అనే మహిళా రైతు ఆవేదన వ్యక్తం చేసింది. ఈ విషయమై అధికారులు కలుగజేసుకొని తమకి యూరియా ఇప్పించాలని రైతులు మొరపెట్టుకుంటున్నారు. ఈ విషయమై వ్యవసాయాధికారి సూర్యకుమారిని వివరణ కోరగా ప్రైవేటు డీలర్ల వద్ద ఉన్నటు వంటి స్టాక్ సేల్ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. తామే రైతులకు దగ్గరుండి పంపిణీ చేస్తున్నామని చెప్పారు.


వ్యవసాయాధికారులు ఇచ్చిన రసీదు చూపిస్తున్న రైతులు

పాఠశాల వద్ద మాంసం విక్రయించొద్దు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రహరీని ఆనుకొని ఎటువంటి చికెన్ మటన్ దుకాణాలనూ నిర్వహించ కూడదని తహశీల్దార్ శ్రీనివాసరావు ఆదేశించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఎస్‌కోట, విశాఖ రహదారి పక్కన ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రహరీగోడ వైపు మాంసం విక్రయ దుకాణాలను తహశీల్దార్ శ్రీనివాసరావు సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాల పరిసరాలలో మాంసం విక్రయించడకూడదని, వేరే చోటుకు దుకాణాలను తరలించుకోవాలని దుకాణదారులకు సూచించారు. జంతువుల మృత కళేబారాలను దుకాణాల్లో వేలాడదీయడం, పాఠశాల పరిసరాలను, రహదారులను అపరిశుభ్రం చేయడం, వాతావరణాన్ని దుర్గంధ భరితంగా మార్చడం విద్యా, పర్యావరణ, జంతు పరిరక్షణా చట్టాలను ఉల్లంఘించడమేనని ఇటువంటి నేరాలకు పాల్పడిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకునేందుకు వెనుకాడమని హెచ్చరించారు. తహశీల్దార్ తీసుకుంటున్న చర్యలపై స్థానికులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

రైతుసేవా కేంద్రంలో 'పశువైద్యం'

◆శిథిలావస్థలో పశువైద్య కేంద్రం ◆లోపలికి వెళ్లేందుకు భయపడుతున్న రైతులు ◆అమలు కాని వాగ్దానాలతో అవస్థలు

ప్రజాశక్తి - సంతకవిటి

మండలంలోని వాల్తేరు పశువైద్యశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో పాడిరైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు 35 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ భవనం ఇప్పుడు వైద్య సేవలు అందించడానికి పూర్తిగా అనర్హంగా మారింది. చిన్న చినుకు పడినా భవనం జలమయం అవుతోంది. ఫలితంగా పశువైద్య మందులు, పరికరాలు తడిసి నాశనమవుతున్నాయి. ఈనేపథ్యంలో వాల్తేరు రైతు సేవా కేంద్రంలో పశు వైద్య సేవలు అందిస్తున్నారు.

అపాయంలో సిబ్బంది.. భయంతో పాడి రైతులు

భవనం గోడలు, పైకప్పు ఎప్పుడు కూలిపోతాయోనన్న భయంతో సిబ్బంది రోజూ బితుకు బితుకుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. పాడిరైతులు కూడా వైద్యశాల లోపలికి అడుగుపెట్టేందుకు భయపడుతున్న పరిస్థితి నెలకొంది. అయినప్పటికీ ఈ పశువైద్యశాలపై 14 గ్రామాల పాడిరైతుల ఆధారపడాల్సిన పరిస్థితి ఉండటం మరింత సమస్యాత్మకంగా మారింది.



పశువైద్య కేంద్రంగా వినియోగిస్తున్న ఆర్‌ఎస్‌కె భవనం

గాల్లోనే వాగ్దానాలు

గతంలో అధికా రులు, ప్రజాప్రతినిధులు కొత్త పశువైద్యశాల నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలిం చినప్పటికీ అది మాటలకే పరిమితమైందని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. భవనం పరిస్థితి రోజు రోజుకూ దారుణంగా మారుతున్నా అధికార యంత్రాంగం పట్టించు కోవడంలేదని పాడి రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతు సేవా కేంద్రమే ప్రత్యామ్నాయం

వర్షం పడితే పశువైద్యశాల పూర్తిగా నీటితో నిండిపోతుంది. ఇటీవల కురిసిన వర్షాల నుంచి సమీపంలోని వాల్తేరు రైతు సేవా కేంద్రంలో తాత్కాలికంగా పశువైద్య సేవలు అందిస్తున్నారు. ఈ కేంద్రం ప్రస్తుతం ఖాళీగా ఉండటంతో గ్రామ పెద్దలు, పాడి రైతుల అభ్యర్థనపై అక్కడే చికిత్స అందించాల్సి వస్తోంది.

పాడి రైతుల డిమాండ్

వాల్తేరు పశువైద్యశాల పూర్తిగా శిథిలమై ప్రమాదకరంగా మారిన నేపథ్యంలో తక్షణమే కొత్త పశువైద్యశాల భవనం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. పాడి రైతుల ఇబ్బందులు పరిష్కరించేందుకు అవసరమైన వసతులు కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పెరిగిన చలి

ప్రజాశక్తి - వేపాడ

గత పది రోజులుగా చలి విపరీతంగా పెరిగింది. ఫలితంగా వృద్ధులు, చిన్నపిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని మైదాన ప్రాంతంలో ఉదయం 8 గంటల దాటినప్పటికీ విపరీతమైన చలిని తట్టుకోలేక చలి మంటలు వేసుకుని ఉండాల్సి వస్తుంది. ఏజెన్సీ ప్రాంతమైన కేజీపూడి సచివాలయం పరిధిలో తొమ్మిది గిరిజన గ్రామాలు, చిట్టివానిపాలెం, గతబవలస, బంగారయ్యపేట, ఎస్ఎస్‌కేఆర్‌పురం, పాత మారిక, కొత్త మారిక, బొర్రావలస, కడ కొండ, కొలుకువానిపాలెం, పెదదుంగాడ, చిన్న దుంగాడ, పోతుబందిపాలెం, వెంకయ్యపాలెం గ్రామాల్లో కొండకు అనుకుని ఉన్న వారి పరిస్థితి ఎలా ఉంటుందో ఇట్టే అర్థం చేసుకోవచ్చును. ఈ గ్రామాలలో నివసిస్తున్న ప్రజలు విపరీతమైన చలికి తట్టుకోలేక చలి మంటలు వేసుకోవలసిన పరిస్థితి ఏర్పడింది.

అంగన్వాడీ కేంద్రాల సందర్శన

ప్రజాశక్తి- దత్తిరాజేరు

మండలంలోని పాచలవలస రెండు అంగన్వాడీ కేంద్రాలను ఐసిడిఎస్ పిఒ రాజేశ్వరి బుధవారం సందర్శిం చారు. కేంద్ర ంలో ఉన్న రికార్డులు పిల్లలు హాజరు గ్రోత్, గర్భిణి, బాలింతలకిస్తున్న సరుకులు రికార్డులు, పిల్లలకు పెడుతున్న మెనూ రుచి చూశారు. పిల్లలు రైమ్స్ పాటలు చెప్పడంతో పిల్లలతో కొంతసేపు ముచ్చటించారు. రెండు అంగన్వాడి కేంద్రాల కార్యకర్తల పనితీరు బాగుందని సంతృప్తి చెందారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ హేమలత, అంగన్వాడి కార్యకర్తలు సుజాత, రాములమ్మ, ఆయాలు ఉమా, శకుంతల పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న పిఒ రాజేశ్వరి

ఈవ్‌టీజింగ్ చేస్తే చర్యలు

నెల్లిమర్ల: ఈవ్‌టీజింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ బి.గణేష్ హెచ్చరించారు. బుధవారం ఆయన సతివాడ మోడల్ స్కూల్లో చట్టాలు, ఈవ్‌టీజింగ్, సైబర్ నేరాలు, రహదారి భద్రత, వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు కాలేజీ పిల్లలు, స్కూల్ పరిసరాలు ప్రాంతాల్లో ఈవ్ టీజింగ్ చేసే ఆకతాయిలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వేధింపులు జరిగినపుడు పోలీస్‌లకు బయపడకుండా ఫిర్యాదు చేయాలని ఆయా పాఠశాలలో ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మండల పరిధిలో సతివాడ మోడల్ స్కూల్ జంక్షన్, సికెఎం కాలేజ్, మిమ్స్ కాలేజ్ జంక్షన్‌లో వద్ద కొంతమంది అల్లరి చిల్లరగా తిరుగుతూ ఉన్నట్లు తమ వద్ద సమాచారం ఉందని ఇంతవరకు కొంతమందికి కౌన్సిలింగ్ చేశామని మితిమీరితే కౌన్సిలింగ్ లేకుండా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ పరిసర ప్రాంతాల్లో సివిల్ డ్రెస్‌లో పోలీసులు తిరుగుతూ సమాచారం సేకరిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన రెడ్ క్రాస్ సొసైటీ

శృంగవరపు కోట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎస్‌కోట బ్రాంచ్ ద్వారా కాలేజీ రెడ్‌క్రాస్ వైఆర్‌సి కోఆర్డినేటర్ సిహెచ్ శ్రీనివాసరావు అధ్యక్షతన బుధవారం మొక్కలు నాటారు. ఎస్‌కోట బ్రాంచ్ చైర్మన్ డాక్టర్ పి.వరలక్ష్మి, జిల్లా మేనేజ్మెంట్ కమిటీ మెంబర్ డి.సూర్యారావు, ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు, అధ్యాపకులు, బ్రాంచ్ కార్యదర్శి డి ధనుంజయ్ లైఫ్ మెంబర్ ఎం.బాలు విద్యార్థులతో కలిసి జామ, పనస, నేరేడు, బాదం, తురాయి, వేప, కాగు వంటి 40 మొక్కలను నాటారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని తిమిడి, వసి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ కొనుగోలు కార్యక్రమాన్ని చేపట్టిందని అన్నారు. దళారుల ప్రమేయం లేకుండా, రైతులు తమ ధాన్యాన్ని నేరుగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాలలో విక్రయించుకోవచ్చని స్పష్టం చేశారు. 24 గంటల్లో రైతు ఖాతాల్లో డబ్బులు జమవుతాయని, కొనుగోలు ప్రక్రియను అధికారులు మరింత వేగవంతం చేసి, రైతుల నుంచి ధాన్యాన్ని సకాలంలో సేకరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎఒ రవీంద్ర, మాజీ సర్పంచ్ రాయవరపు రవి, యేడువాక అప్పలనాయుడు మాస్టర్, ఎర్ర గోపి, బూత్ ఇంచార్జ్ కొల్లు వీర్రాజు, స్థానిక అధికారులు, రైతులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోళ్ల

పాఠశాలల సందర్శన

ప్రజాశక్తి - వేపాడ

ఎంఇఒలు ఎన్ నాగభూషణరావు, పి. బాల భాస్కర రావులు బుధవారం సోంపురం ఎంపిపిఎస్ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిఎస్ఎల్ఎన్ 75 డేస్‌ను విజయవంతం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. 75డేస్ యాక్షన్ ప్లాన్ పాటిస్తూ విద్యార్థులను ఉన్నత స్థాయికి ఎదిగే విధంగా నైపుణ్యాన్ని పెంపొందించాలని అందుకు ప్రతి ఒక్క ఉపాధ్యాయుడూ కష్టపడి పనిచేయాలని, ప్రధానంగా విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించినాడే ఉన్నత స్థాయి చదువులకు వెళ్లే అవకాశం కలుగుతుందని చెప్పారు. అనంతరం తెలుగు, ఇంగ్లీషు చదివించడం, విద్యార్థులతో రైమ్స్ పాటించడం వంటి కార్యక్రమాలను చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పిలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

అనంతరం ఎంఇఒ 1 ఎన్.నాగభూషణరావు ఆతవ ప్రాథమిక పాఠశాలను సందర్శించి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎన్‌కేఆర్‌పురం హెచ్ఎం తాతబాబు తదితరులు పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న ఎంఇఒ బాల భాస్కరరావు

యుటిఎఫ్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- మెరకముడిదాం

మండల కేంద్రంలో యుటిఎఫ్ మహాసభ మండల సింహాద్రి నాయుడు అధ్యక్షతన బుధవారం ఘనంగా నిర్వహించారు. గత సంవత్సర కాలంలో జరిగిన కార్యక్రమాలు చర్చించడంతోపాటు మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. యుటిఎఫ్ మండల అధ్యక్షుడుగా మాడుగుల రమణ, ప్రధాన కార్యదర్శిగా వెంకట చినప్పలనాయుడు, గౌరవ అధ్యక్షునిగా కె.సీతారాం, గౌరవ సలహాదారునిగా మండల సింహాద్రి నాయుడు, ఉపాధ్యక్షులుగా గౌరీ లక్ష్మి, సహాధ్యక్షునిగా కె.గౌరీ శంకర్, కోశాధికారిగా రామన్న దొరలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం బదిలీపై వెళ్లిన యుటిఎఫ్ నాయకులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాస్, గౌరవాధ్యక్షుడు మీసాల అప్పలనాయుడు, జిల్లా కార్యదర్శి ఎం.రఘునాథరాజు, మాజీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మండల రమేష్, మజ్జి హరికృష్ణ, వివిధ పాఠశాలకు సంబంధించి 79 మంది ఉపాధ్యాయులు హాజరై నూతనంగా కార్యవర్గాన్ని అభినందించారు.

మోడల్ పేపర్ పంపిణీ



మోడల్ పేపర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

కొత్తవలస: యుటిఎఫ్ ఆధ్వర్యంలో తయారు చేసిన పదో తరగతి మోడల్ పేపర్లను ఎంఇఒ బండారు శ్రీనివాసరావు చేతుల మీదుగా బుధవారం ఆవిష్కరించారు. మండలంలో ప్రతి పాఠశాలలో మోడల్ పేపర్‌ని అందుబాటులో ఉంచాలని విద్యార్థులకు మంచి ఫలితాలు సాధించే విధంగా పేపర్‌ను తయారు చేశారని, గత ప్రశ్నాపత్రాన్ని పరిశీలించి ఈ పేపర్ విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా తయారు చేశారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్ నిర్మలాదేవి, జి.విజయగౌరి, జిల్లా నాయకులు జి.వెంకటనాయుడు, జి.పార్వతి పాల్గొన్నారు.

సేవాదళ్ అవార్డుకు ప్రసాద్ ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

శిష్టకరణం ఐక్యవేదిక, శిష్టకరణ లేఖ సంయుక్తంగా శిష్టకరణాల అభ్యున్నతికి సేవ చేస్తున్న వారికి అవార్డులు ఇవ్వాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా శిష్టకరణ జాతిలో ఉన్న నిరుపేదలకు, సమాజంలో ఉన్న అన్ని కులాల వారికి సామాజికంగా, ఆర్థికంగా సహాయం చేస్తూ, వారి అభ్యున్నతికి పాటుపడే శిష్టకరణం లిఫ్టింగ్ హ్యాండ్ సంస్థ అడ్మిన్, మదర్ థెరీసా సేవా సంఘం అధ్యక్షులు త్యాడ ప్రసాద్ పట్నాయక్ ఈ అవార్డుకు ఎంపికయ్యారు. ఈనెల 20న హైదరాబాద్‌లో ఈ అవార్డును అందుకోనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవార్డు తనకు రావడం చాలా ఆనందంగా ఉందన్నారు.


మస్తర్లను తనిఖీ చేస్తున్న ఎంపిడిఒ స్వరూపారాణి

అభివృద్ధి పనులు పరిశీలన

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని సవరవిల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గల వెంపాడపేట చెరువు నుంచి పెద్ద చెరువుకు నీరు చేరే ఫీడర్ ఛానెల్ అభివృద్ధి పనులను ఎంపిడిఒ స్వరూపారాణి బుధవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. రైతులకు సాగునీరు సమృద్ధిగా అందించాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ పనులు వేగంగా, నాణ్యతతో సాగాలని అధికారులకు సూచించారు. వర్షాకాలంలో వచ్చే నీటిని సమర్థవంతంగా పెద్ద చెరువుకు మళ్లించడం ద్వారా చెరువుల్లో నీటి నిల్వ పెరిగి, భూగర్భ జల మట్టం మెరుగుపడుతుందని, దీని వల్ల పరిసర గ్రామాల రైతులకు ఖరీఫ్, రబీ పంటలకు సాగునీటి ఇబ్బందులు తీరనున్నాయని చెప్పారు. పనుల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్న ఆమె ఎలాంటి అవకతవకలకూ తావులేకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనులు పూర్తి చేయాలని సిబ్బందికి ఆదేశించారు.

పార్టీలకతీతంగా పథకాలు అమలు చేయాలి : శంబంగి

ప్రజాశక్తి- రామభద్రపురం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు రాజకీయ పార్టీలకతీతంగా అమలు చేయాలని బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. స్థానిక మండల వైసిపి కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాటాడారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ పథకాలు అందించామని గుర్తుచేశారు. పేదలందరికి ఇంటి గ్రాంటుతోపాటు ఇంటి స్థలం కూడా మంజూరు చేశామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చాలా గ్రామాల్లో అధికార పార్టీ కార్యకర్తలకే ఇళ్లు మంజూరు చేస్తున్నారని ఇది పద్ధతి కాదని అన్నారు. బొబ్బిలి నియోజకవర్గంలో ఇళ్ల గ్రాంటు మంజూరులో హౌసింగ్ డిఇ రాజకీయ నాయకులకంటే అధ్వాన్నంగా వ్యవహరించడం సబబు కాదన్నారు. గ్రామాల్లో టిడిపి కార్యకర్తలు చెప్పినవారికే జియో ట్యాగింగ్ చేయాలని హుకుం జారీ చేయడం ఉద్యోగ ధర్మం కాదన్నారు. ప్రభుత్వాలు శాశ్వతం కాదని, ప్రభుత్వాలు మారితే అధికారుల పరిస్థితి ఏ విధంగా ఉంటుందో అర్థం చేసుకోవాలని హెచ్చరించారు. రాజకీయాలు చేయాలనుకునే అధికారులు ఉద్యోగిగా రాజీనామా చేసి రాజకీయాల్లోకి దిగాలని హితవు పలికారు. ఈ సమావేశంలో ఎంపిపి చొక్కావు లక్ష్మణరావు, జెడ్‌పిటిసి అప్పికొండ సరస్వతి, మండల వైసిపి యూత్ అధ్యక్షులు పత్తిగుళ్ల ఏక్నాథ్, వైసిపి నాయకులు నడిమింటి సత్యం, డర్రు పైడిరాజు పాల్గొన్నారు.

పల్స్‌పోలియో విజయవంతం చేయండి

ప్రజాశక్తి - కొత్తవలస

ఈ నెల 21న చేపట్టనున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వియ్యంపేట పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ గోపాలకృష్ణ తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో బుధవారం పోలియో చుక్కలు వేసే బూత్ లెవెల్ వాక్సినేటర్స్‌కి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుండి 5 ఏళ్ళ లోపు గల పిల్లలకి తప్పక పోలియో చుక్కలు వేయించాలని ఆయన సూచించారు. 21 బూత్ లెవెల్‌లో పోలియో చుక్కలు వేస్తారని, 22, 23 తేదీలలో ఇంటింట సర్వే చేసి పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. ఉదయం 7 గంటలు నుండి సాయంత్రం 5 గంటలు వరకు పోలియో చుక్కలు వేస్తారని, 19 బూత్‌ల్లో 80 మంది, 40 టీమ్‌లుగా పోలియో చుక్కలు వేసి, ఇంటింట సర్వే చేస్తారని తెలిపారు. పిహెచ్‌సి పరిధిలో 12 పంచాయతీలలో 27 గ్రామాలలో 1553 మంది పిల్లలకి పోలియో చుక్కలు వేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్స్, ఎమ్ఎల్‌హెచ్‌పిలు, ఏఎన్ఎంలు, అంగన్వాడీ వర్కర్స్, ఆశ వర్కర్స్,వాలంటీర్స్ పాల్గొన్నారు.

వేపాడ: ఈ నెల 21న చేపట్టనున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వెల్నెస్ సెంటర్ సిహెచ్ఒ పార్థసారధి అన్నారు. మండలంలోని సింగరాయి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పల్స్‌పోలియో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సంతకవిటి: 5 సంవత్సరాల లోపు ఉన్న ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయాలని సంతకవిటి పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. బుధవారం సంతకవిటిలో ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బందికి పల్స్ పోలియో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 21న పల్స్ పోలియో బూత్ కార్యాచరణ చేపడతామని తెలిపారు. డిసెంబర్ 22 నుంచి 24 వరకు చిన్నారులు ఉన్న ప్రతి గడపకూ వెళ్లి పోలియో చుక్కలు వేయనున్నట్లు చెప్పారు. పిహెచ్‌సి పరిధిలో 29 పోలియో బూత్‌లు ఏర్పాటు చేయగా, సుమారు 2వేలు మంది చిన్నారులు ఉన్నారని వెల్లడించారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.